మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# డిసిసిబిలో నిధులు స్వాహా...?

## కేసుల నమోదులో అధికార యంత్రాంగం విఫలం

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డీసీఓ...?




**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 03 ప్రభాతవార్త :** డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ (డిసిసిబి) భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో జిల్లా స్థాయిలో పనిచేస్తున్న గ్రామీణ సహకార బ్యాంక్ (1) (2) ఇది ప్రధానంగా గ్రామీణ సెమీ అర్బన్ ప్రాంతాలలో స్థాపించబడిన శాఖలతో వ్యవసాయ రంగానికి గ్రామీణ లోతట్టు ప్రాంతాలకు బ్యాంకింగ్ అందించడానికి స్థాపించబడింది. సహకార సంఘాల వ్యవస్థలో ఏర్పడి శతాబ్దం దాటిన చట్టాలు అసంబద్ధంగా మారడంతో పైనుంచి కింది వరకు సహకార రంగంలో అవినీతి బాగోతాలు వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో సహకార వ్యవస్థ ప్రక్షాళన పరిశీలనకు డిసిఓ వ్యవహరిస్తున్నారు. చేనేత జౌళిశాఖ నుండి రుణాలు పొంది నిధులు స్వాహా చేసిన పెద్ద అదిరాల చేనేత సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. రుణభారం 11 లక్షల నుండి 20 లక్షలకు చేరినట్లు సమాచారం. ఈ డబ్బులు రికవరీ చేయాలంటే స్వాహా చేసిన వారి నుండి సొంత పట్టా భూములు వేలం వేయాల్సి వచ్చింది. అప్పట్లో రాజకీయ నాయకులు అడ్డుకోవడంతో సీఈఓ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నారాయణపేట వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం షాపింగ్ కాంప్లెక్స్‌లో నిధుల గోల్‌మాల్ జరగడంతో జిల్లా కలెక్టర్ విచారణ పూర్తి చేశారు. బాధ్యులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకుండా డీసీఓ కాలయాపన చేస్తున్నారని పేట జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారులు వెల్లడించారు. అలాగే గోరిట ప్రాథమిక సహకార సంఘాల్లో అధ్యక్షులు జక్కా రఘునందన్‌రెడ్డి పర్సనల్ లోన్ కింద రెడు కోట్ల రూపాయలు నిధులు బినామీ పేర్లపై తీసుకొని నెల కిస్తుల కింద నగదు చెల్లించడ లేదని ఆయనను తప్పించి ఉపాధ్యక్షులను బాధ్యతలు అప్పగించారు. ఆయన కూడా తమ కుటుంబ సభ్యుల పేరుపై 30 లక్షల రూపాయల నిధుల పర్సనల్ లోన్ కింద తీసుకుని చెల్లించడం లేదని సమాచారం. లక్షల రూపాయలు అక్రమంగా డిసిసి బ్యాంక్ ద్వారా తీసుకుని భవనాలు నిర్మించారు. కాని వాటి నుంచి రైతులకుగాని సొసైటీ గాని ఎలాంటి లాభం లేదు. నిధులు ఖర్చయ్యాయి. కాంట్రాక్టర్ కమిషన్ వచ్చింది కానీ, నెలనెల వడ్డీతో సహా నగదు ఎలా చెల్లించాలో రైతులకు అర్థం కావడం లేదు. జడ్చర్ల సహకార సొసైటీలో సిఓ యాదగిరి గోనెసంచులు, ఫర్టిలైజర్, నిధులను రికవరీలో నిధులు స్వాహా చేసిన సస్పెండ్ చేయకుండా కాలయాపన చేస్తున్నారు. అలాగే వనపర్తి సొసైటీలో గత సంవత్సరం అక్రమాలు చోటు చేసుకున్నాయి. అద్దె బకాయిల కింద అడ్వాన్సులు తీసుకుని 1,20,000 నిధులు స్వాహా అయినట్లు గతంలో వార్తలు ప్రచురణ చేయడంతో స్పందించిన ఛైర్మన్ నగదు బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తామని చెప్పి చేతులు దులుపుకొన్నారు. డిసిసి బ్యాంకులో కంప్యూటర్‌లో కుంభకోణం వ్యవహారంలో విచారణ పూర్తయింది. బాధ్యులపై పోలీస్ కేసు నమోదు చేయాలని టెస్కాబ్ అధికారులు జిల్లా డిసిఓకు సమాచారం ఇచ్చినా ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ అవినీతి రికవరీ పూర్తయితే బ్యాంకుకు 40 లక్షలకు పైగా నగదు రావాల్సి ఉంది. డిసిఓ నిర్లక్ష్యానికి డిసిసి బ్యాంకుకు రావలసిన కోట్ల రూపాయలు రికవరీ ఆగిపోయిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై డిసిఓను వివరణ కోరగా సమస్య మా దృష్టికి తీసుకువస్తే సమాచారం మీకు ఇవ్వాలని ఏమైనా రూల్ ఉందా? అని ప్రశ్నించారు. అవినీతికి సంబంధించిన రిపోర్టు కావాలంటే మీరు దరఖాస్తు ద్వారా కోరితే అందిస్తామంటూ చెప్పారు. సమాచారం జిల్లా కలెక్టర్‌కు మాత్రమే చేరవేయడం మా బాధ్యత అంటూ చెప్పడం గమనార్హం.

## జోగులాంబ సన్నిధిలో ఎమ్మెల్సీ,ఎమ్మెల్యే..



ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడు

**అలంపూర్ జూన్ 03 ప్రభాతవార్త :** ప్రముఖ ఐదవ శక్తి పీఠమైన అలంపూర్ శ్రీ జోగులాంబ, బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఉమ్మడి మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా నూతనంగా గెలుపొందిన నవీన్ కుమార్ రెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి, ఎమ్మెల్యే విజయుడుతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాద

- మిగతా 3లో..

# రిజల్ట్ డే

- కౌంటింగ్‌కు అంతా రెడీ
- రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు
- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్
- ఏర్పాట్లను పరిశీలించిన రిటర్నింగ్ అధికారులు



పీయూలో కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



నాగర్‌కర్నూల్‌లో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జోగులాంబ కలెక్టర్ బీఎం సంతోష్



పీయూలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 03 ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు అంతా సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలువడనున్నాయి. నేటి (మంగళవారం) ఉదయం 8 గం.ల నుంచి ఓట్ల లెక్కింపునకు రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. మే 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరిగింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌లో మొత్తం 31 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 16,82,470 మంది ఓటర్లు ఉండగా, 1218587 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 72.43 నమోదైంది. పోలింగ్ పూర్తయిన తర్వాత 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవిఎంలను పాలమూరు యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ మేరకు పాలమూరు యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపునకు జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ సారథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలమేరకు సర్వం సిద్ధం చేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నారు. కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 282 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 21 రౌండ్లు, నారాయణపేట 270 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్, 20 రౌండ్లు, మహబూబ్‌నగర్‌లోని 275 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 20 రౌండ్ల వారిగా ఓట్లను లెక్కించనున్నారు. జడ్చర్ల 274 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 20 రౌండ్స్, దేవరకద్ర 289 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి14 టేబుల్స్ 21 రౌండ్స్, మక్తల్ 284 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 21 రౌండ్స్,షాద్‌నగర్ 263 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 14 టేబుల్స్ 19 రౌండ్ల వారిగా ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కౌంటింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల కోసం సీట్లు కేటాయించారు.లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ నిరంతరాయంగా ఉండేలా చర్యలు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ఏడు నియోజకవర్గాలకు కౌంటింగ్ సిబ్బందిని నియోజకవర్గంలో వారిగా సైతం అలాట్ చేశారు. దీనికోసం సెకండ్ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఆదివారం రిటర్నింగ్ అధికారి రవినాయక్ ఆధ్వర్యంలో సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా సమక్షంలో నిర్వహించారు. కౌంటింగ్ సూపర్‌వైజర్స్ 140 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 153 మైక్రో అబ్జర్వర్లు 145 మందిని రిజర్వు 20 శాతంతో కేటాయించారు. మంగళవారం ఉదయం 6 గం.లకు వీరిని టేబుల్స్ వారిగా కేటాయించనున్నారు. వీరందరికి ఇప్పటికే ఓట్ల లెక్కింపుపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం ఉదయం 8 గం.లనుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. ఎనిమిదిన్నర గంటల నుండి ఈవిఎంల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికల ఫలితాలను రౌండ్ల వారిగా ప్రకటించనున్నారు. ఈ మేరకు ఎప్పటికప్పుడు ఫలితాలను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌తో పాటు ఎంకోర్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయనున్నారు. కేంద్ర బలగాలు, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లకు గుర్తింపు కార్డులను అందిస్తున్నారు. గుర్తింపు కార్డులు లేని ఏజెంట్లు, సిబ్బందిని అనుమతించేది లేదని అధికారులు సూచించారు. సోమవారం పాలమూరు యూనివర్సిటీలో కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రవినాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మొత్తానికి ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది.



ఎన్నికల బందోబస్తులో పాల్గొననున్న పోలీస్ అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్ యాదవ్

# నిరంజన్‌రెడ్డి..నోరు అదుపులో పెట్టుకో

- గ్యారెంటీలు తప్పక అమలు చేస్తాం..
- కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్

వనపర్తి ప్రతినిధి, జూన్ 3 ప్రభాతవార్త : తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని అవహేళనగా మాట్లాడిన మాజీమంత్రి నిరంజన్ రెడ్డి అయన ఎందో మేధావి అనుకున్నాం, కానీ ఆయన మాటలను చూస్తుంటే మతిభ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ అన్నారు. వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ -మిగతా 4లో..

## డ్రైవర్ నిర్లక్ష్యానికి చిన్నారి బలి

- ఆటోలో నుంచి ఎగిరిపడి పసిబిడ్డ మృతి
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వద్ద ఘటన

4లో



## నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో..



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 03 ప్రభాతవార్త: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రమైన నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాటును నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గంలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, గద్వాల, వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గాలకు 16 టేబుల్స్, అలంపూర్, కల్వకుర్తి, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 14 టేబుల్స్ చొప్పున ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లను నిశితంగా పరిశీలన నిర్వహించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్‌ను సందర్శించారు. ఆయా కౌంటింగ్ హాల్‌లో టేబుల్స్, బారికేడ్లు, సీసీ కెమెరాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు పక్కగా నిర్వహించేలా పర్యవేక్షణ నిర్వహించాలని కలెక్టర్ సహాయ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ప్రతి కౌంటింగ్ టేబుల్స్ వద్ద నియోజకవర్గ వివరాలను తెలిపే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని, ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓటు తిరస్కరణకు గురైతే అందుకు గల కారణాలను అభ్యర్థులు, వారి ఏజెంట్లకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంల ఓట్లను ఒక్కో రౌండ్ వారీగా జాగ్రత్తగా లెక్కిస్తూ ప్రతి రౌండ్‌కు ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని కోరారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైన సాంకేతిక సమస్యలు తలెత్తితే సంబంధిత నిపుణులు వచ్చి సరిచేస్తారని, కౌంటింగ్ ప్రక్రియను యధాతథంగా కొనసాగించాలని తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో వివిధ కార్యకలాపాల నిర్వహణ కోసం పాసులు అందించాలని, పాసులు కలిగిన వారికే కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించాలని సూచించారు. కలెక్టర్ వెంకట అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# బిఆర్ఎస్ తెలంగాణకు రక్షణ కవచం

- రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బిఆర్ఎస్‌దే విజయం
- మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్
- ఎక్కడికెళ్లినా కెసిఆర్ సంక్షేమమే: ఎంపి మన్నె
- మళ్లీ అధికారంలోకి వస్తాం: మాజీ మంత్రి లక్ష్మారెడ్డి
- మహబూబ్‌నగర్‌లో దశాబ్ది ఉత్సవాలు



జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి

మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 03 ప్రభాతవార్త : ఇంత తక్కువ కాలంలో ప్రజా వ్యతిరేకత కూడగట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ రాష్ట్ర ఆవిర్భావ ముగింపు ఉత్సవాల సందర్భంగా ఎంపి మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ తెలంగాణ కోసం పుట్టిన పార్టీ ప్రజల రక్షణ కవచంగా పార్టీ ఎప్పుడు ఉంటుందన్నారు. 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఎందుకు వాటిని అమలు చేయడం లేదో గ్రామాలకు వస్తే కాంగ్రెస్ నేతలని నిలదీయాలని పిలుపునిచ్చారు. ప్రజలు బిఆర్ఎస్ పాలన ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న పరిస్థితి ఉందన్నారు. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగిన బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న వారికి భవిష్యత్తు ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికలు కేవలం మోడీ రాహుల్‌గాంధీ మధ్యలో జరిగాయి. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం తెలంగాణలో బిఆర్ఎస్ పాలన కావాలని కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు బిఆర్ఎస్ పార్టీ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్న విషయం స్పష్టం చేస్తున్నాయి. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం జరిగిందన్నారు. రైతులకు కరెంటు పంటకు పెట్టుబడి ఇవ్వడంతోపాటు పండించిన పంట కూడా కొనుగోలు చేశామన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ ప్రజల సంక్షేమం మరిచిందని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు నిలిపివేశారని ఆరోపించారు. కెసిఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్న విషయం ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో స్పష్టం అయిందన్నారు. పార్టీ అధికారంలోకి వస్తుంది. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలన్నారు. ఎంపి మన్నె శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2014 తరువాత తెలంగాణలో చాలా మార్పులు వచ్చాయని కెసిఆర్ ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమం పరుగులు తీసిందన్నారు. బిజెపి తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమి లేదు. ఏ గ్రామానికి వెళ్లిన కెసిఆర్ చేసిన సంక్షేమం అభివృద్ధి కనిపిస్తుందని చెప్పారు. అనంతరం రెడ్‌క్రాస్ అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు పండ్లు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పోరేషన్ ఛైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, జడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నర్సింహులు, ముడా మాజీ ఛైర్మన్ గంజి వెంకన్న, మహబూబ్‌నగర్ ఎంపిపి బాలరాజు, మహబూబ్‌నగర్ ఎంపిపి సుధాశ్రీ, మహబూబ్‌నగర్ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్‌నగర్ మండల అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, హన్వాడ మండల అధ్యక్షులు కరుణాకర్‌గౌడ్, డిసిసిబి వైస్ ఛైర్మన్ వెంకటయ్య, సీనియర్ నాయకులు రవిందర్‌రెడ్డి, గణేష్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, గోపాల్ యాదవ్, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.



## ఏజెంట్లకు సూచన

మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 03 ప్రభాతవార్త : ఎన్నికల కౌంటింగ్ నిర్వహణలో పాటించాల్సిన నియమ, నిబంధనలకు సంబంధించి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి పలు సూచనలు సలహాలు అందించారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని సుదర్శన్ కన్వన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని ఏజెంట్లకు సూచనలు సలహాలు చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి సంపత్‌కుమార్, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రం పరిశీలన

మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 03 ప్రభాతవార్త : పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కే ంద్రాలను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ అభ్యర్థి డీకే అరుణ పరిశీలించారు. ఎన్నికల కౌంటింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల నిర్వహణ అధికారులను కోరారు. కౌంటింగ్ కేంద్రాలు, భద్రతకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పద్మజారెడ్డి, డీకే స్నిగ్ధారెడ్డి ఉన్నారు.



# చిన్నారుల ప్రతిభ అభినందనీయం..

**చిన్నారులకు బ్లాక్ బెల్టు అందజేసిన బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణమ్మ**

**మహబూబ్‌నగర్‌లోని ఆర్‌కె కరాటే అండ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏడాది పాటు శిక్షణ**

**బ్లాక్ బెల్టు సాధించిన ఆరుగురు చిన్నారులు**

**చిన్నారులకు బ్లాక్ బెల్టు అందజేసిన డికె అరుణ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 03 ప్రభాతవార్త :** ఆత్మరక్షణ కోసం ఉపయోగించే కరాటే శిక్షణ పూర్తి చేసుకుని చిన్నారులు బ్లాక్‌బెల్టు సాధించడం అభినందనీయమని బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్‌లోని ఆర్‌కె కరాటే స్పోర్ట్స్ అకాడమీ సంస్థ డైరెక్టర్ కె. రవికుమార్ ఆధ్వర్యంలో చిన్నారులు, వారి పేరెంట్స్ అరుణమ్మను కలిశారు. ఈ సందర్భంగా కరాటేలో ఏడాది కాలంపాటు శిక్షణ పూర్తి చేసుకుని బ్లాక్‌బెల్టు సాధించిన చిన్నారులను సన్మానించి బ్లాక్‌బెల్టు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. విద్యతో పాటు చిన్నారులు ఇలాంటి ఆత్మరక్షణ విద్య కరాటేలో ప్రావీణ్యం సాధించడం గర్వకారణమని అన్నారు. మీరంతా భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. పిల్లలను ప్రోత్సహించిన తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన ఆర్‌కె కరాటే అకాడమీ డైరెక్టర్ మాస్టర్ రవికుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.



చిన్నారులను అభినందిస్తున్న డికె అరుణ

## షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు లా గ్రాడ్యుయేట్ చేయుటకు దరఖాస్తులు చేసుకోండి

**జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్వేత ప్రియదర్శిని**

**గద్వాల ప్రతినిధి జూన్ 3 ప్రభాతవార్త:** షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు లా గ్రాడ్యుయేట్ చేయుటకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి శ్వేత ప్రియదర్శిని ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న ఎస్సీ గ్రాడ్యుయేషన్ అందరికీ శాచురేషన్ పద్ధతిలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకోను వారు ఈ నెల 7 నుండి చివరి తేది. జూలై 6 2024 వరకు వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోగలరని తెలియజేశారు. విద్యార్థులను ఎంపిక చేయు తేది 15.07.2024 ఎంపిక అయినవారికి నెలకు రూ.3000 చొప్పున మూడు సంవత్సరాలు ఇవ్వనున్నట్లు డిజిటల్ బుక్స్, కంప్యూటర్, ఫర్నిచర్, లాయర్ డ్రెస్ కోసం రూ.50 వేలు పెంచి ఒకేసారి మంజూరు చేయనున్నట్లు బార్ కౌన్సిల్ వసూలు చేసే వాస్తవ రేటు ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున జోగులాంబ గద్వాల జిల్లాలోని అర్హత గల షెడ్యూల్డ్ కులాలకు చెందిన లా గ్రాడ్యుయేట్లకు అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ నందు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

## తాటికొండలో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం..!!

**భూత్పూర్, జూన్ 3, ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం తాటికొండ గ్రామంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కృష్ణ, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి మొహ్మద్ రఫిక్ ఆదేశానుసారం భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యులు, సిబ్బంది సోమవారం వైద్యాధికారులు డాక్టర్ సంధ్యాకిరణ్మయి, డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్‌ల సమక్షంలో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. శిబి రంలో గ్రామానికి చెందిన 121 మందికి వ్యాధి లక్షణా లుండగా ఇందులో 55మందికి తెమడ, కళ్లె పరీక్షలు, ఎక్స్‌రే నిర్వహించినట్లు భూత్పూర్ పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్, హెల్త్ సూపర్‌వైజర్లు యాదమ్మ, సుధాకర్‌లతో పాటు హెల్త్ అసి స్టెంట్ శ్రీనివాస్, పుష్పలీల, రోజాలక్ష్మి, ప్రవీణ, బాలరాజు, రాజు, ఆశ వర్కర్లు,, ఎఎన్ఎంలు పాల్గొన్నట్లు డాక్టర్ రబ్ తెలిపారు.



## కరాటే బ్లాక్, కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

**కొత్తకోట జూన్ 3 ప్రభాతవార్త :** కొత్తకోట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో గాడ్స్ ఆన్ వారియన్స్ చోటు ఖాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో బ్లాక్ బెల్ట్, కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. ఈ బెల్ట్ గ్రేడింగ్ టెస్టులో బ్లాక్ బెల్టు 10 ,కలర్ బెల్ట్ 20 మంది విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి బెల్ట్ సరిఫికేట్లు సాధించారని క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. వీరిలో ఎల్లో బెల్ట్ సాధించిన సుశాంత్ , అదిత్ రెడ్డి, జశ్వంత్, విఘ్నశ్రీ, జశ్వంత్ , పరమేష్ గౌడ్ , సాయి , కౌశిక్, తులసి ఆరెంజ్ బెల్ట్ సాధించగా శ్రీనిజ, గౌతమ్, పవన్, మధు గౌడ్ బ్లూ బెల్టులు సాధించారు. ఆదిత్య , శ్రీ వల్లభ , మెరున్ బెల్ట్ సాధించగా లక్ష్మీకాంత్ రెడ్డి , సాయి, చరణ్, రోహిత్, మేఘన బ్రౌన్ బెల్ట్ సాధించారని తెలిపారు. అనిరుద్ గౌడ్, కె ఏకాంబరి , యోగేశ్వరి, అన్విత , సురేందర్, అరవింద్, వెంకటేశ్వర్ రెడ్డి, ఎం గౌతమ్, కే హర్షవర్ధన్, హఫీజ్, శివకుమార్ యాదవ్‌లు బ్లాక్ బెల్టులు సాధించారు ఈ విద్యార్థులందరినీ కరాటే పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొని విద్యార్దులకు శుభాకాంక్షలు తెలుపుతూ అభినందించడం జరిగింది ఈ మెగా కార్యక్రమంలో క్లబ్బు డిప్యూటీ ఫౌండర్స్ జి హరీష్ యాదవ్ , జాఫర్, సాదిక్, బాబా, అజ్మీర్, లాస్య, కార్తీకేయ యాదవ్, ఎస్కె గౌస్, పాషా తదితరులు పాల్గొన్నారు.



## అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ**

**తెల్కపల్లి, జూన్ 03 ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ద్వారా ఆయా పాఠశాలల్లో పనులను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవనం నందు తెల్కపల్లి, లింగాల మండలాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ఛైర్మన్లకు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన ప్రకారం పాఠశాలలో మౌలిక వసతులు కిటికీలు, తలుపులు, విద్యుత్ సౌకర్యం వంటి పనులను పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల పున: ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించేందుకు సిద్ధంగా ఉడాలని మహిళా సంఘాల సభ్యులకు ఎంఈఓ సూచంచారు. కార్యక్రమంలో లింగాల ఎంపిడిఓ ఆంజనేయులు, తెల్కపల్లి ఎంపిడిఓ కృష్ణయ్య, ఎంపిఓ కర్ణ, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులు, మండల విద్యాధికారి చంద్రుడు, మండల నోడల్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఆయా మండలాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



# జిల్లా ఉపాధ్యాయుడికి గ్రీన్ ఛాంపియన్ అవార్డు..

- 2024 గ్రీన్ ఛాంపియన్ గుముడాల చక్రవర్తిగౌడ్
- ప్రభుత్వ ఉపాధ్యాయుడ్ని అవార్డుకు ఎంపిక చేసిన కాలుష్య నియంత్రణమండలి
- 05 హైద్రాబాద్‌లో మండలి ఛైర్మన్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్న చక్రవర్తిగౌడ్
- చేసిన సేవలకు మంచి గుర్తింపు
- హర్షం వ్యక్తపరుస్తున్న అప్పంపల్లి గ్రామస్థులు
- అభినందిస్తున్న కౌకుంట్ల గ్రామస్థులు




పచ్చదనంతో కళకళలాడుతున్న అప్పంపల్లి ఉన్నత పాఠశాల

**దేవరకద్ర, జూన్ 03 ప్రభాతవార్త:** ఆయన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు..కాని పకృతి ప్రియుడు...అయన ఎక్కడ పనిచేసిన అక్కడ పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషిచేస్తుంటారు...విద్యార్థులకు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణపై పూర్తి అవగాహన కల్పిస్తుంటారు..పని చేసే పాఠశాలలో పచ్చదనం వెల్లివిరిసేలా సాటి ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి తన వంతు కృషి చేస్తుంటారు. ..ఓ పక్క ఉపాధ్యాయ వృతికి న్యాయం చేస్తూనే పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతుంటారు...విద్యార్థులకు దానిపై మక్కువ పెంచుతుంటారు..ఆయనే కౌకుంట్లకు చెందిన అదే మండలంలోని అప్పంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడిగా పనిచేసే గుముడాల చక్రవర్తిగౌడ్...ఓ మంచి కవిగా, కెమెరామెన్‌గా రాణిస్తూనే ఆయన పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించారు... అలాగే పక్షి ప్రేమికుడు కూడ..తాను పనిచేసే పాఠశాలతో పాటు ఎక్కడైన పక్షులు ఆపదలో చిక్కుకున్నట్లు తమ దృష్టికి వస్తే చాలు వెంటనే వాటిని బతికించడానికి సపర్యలు ప్రారంభిస్తారు... అవసరమైతే వాటిని ఇంటికి తీసుకెళ్ళి చికిత్సలు కూడ చేయిస్తారు.. అంతటి మృధుస్వభావి గుముడాల చక్రవర్తిగౌడ్...పక్రృతిలో కనిపించే అందచందాలతో పాటు పక్షులు, వివిద రకాల చెట్లను తన కెమెరాలో బందించి తన ప్రతిభను చాటిన సందార్భాలు చాలా ఉన్నాయి...ఆయన తీసే ప్రతి ఫోటో భావపూరితంగా ఉంటుంది..మంచి కవితలు, కథలు కూడ ఆయన కలం నుండి జాలువారాయి..తాను పనిచేసే పాఠశాలను సాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థుల సహకారంతో పకృతివనంగా తీర్చిదిద్దారు..

**గ్రీన్ ఛాంపియన్ అవార్డుకు గుముడాల చక్రవర్తిగౌడ్ ఎంపిక..**

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న అప్పంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడిగా పనిచేసే గుముడాల చక్రవర్తిగౌడ్ గ్రీన్ ఛాంపియన్ అవార్డుకు ఎంపికయ్యారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్యనియంత్రణ, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన, నీటి వనరుల సంరక్షణ వంటి వివిధ అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం కలిగిస్తూ మొక్కలు నాటి వాటిని సంరక్షించినందుకు గ్రీన్ ఛాంపియన్ అవార్డుకు గుముడాల చక్రవర్తిగౌడ్ ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి ప్రతి ఏడాది పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేసిన వ్యక్తులకు, సంస్థలకు ఇచ్చే గ్రీన్ ఛాంపియన్ 2024 ఏడాది అవార్డుకు ఆయనను ఎంపికచేసింది. ఈ నెల 5న హైద్రాబాద్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజు కాలుష్యనియంత్రణ మండలి ఆడిటోరియంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో మండలి ఛైర్మెన్ శాంతికుమారి చేతుల మీదుగా గుముడాల చక్రవర్తిగౌడ్ ఈ అవార్డును అందుకోనున్నారు. పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన సేవలకు ఈ అవార్డు దక్కనుంది. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్, ఏయంఓ దుంకుడు శ్రీనివాస్, సియంఓ బాలుయాదవ్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, అప్పంపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్ అభినందించారు. గుముడాల చక్రవర్తిగౌడ్ పనిచేసే అప్పంపల్లితో పాటు అయన స్వ గ్రామమైన కౌకుంట్ల గ్రామస్థులు కూడ ఆయనపై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.



పాఠశాలలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న చక్రవర్తిగౌడ్




పాఠశాలలో పాఠశాల పకృతి వనం బోర్డును పెడుతున్న చక్రవర్తిగౌడ్

# ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డిని సన్మానించిన బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు

**గద్వాల ప్రతినిధి జూన్ 3 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం జరిగింది. ఎమ్మెల్సీగా గెలుపొంది మొట్టమొదటిసారిగా గద్వాలకు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంలో జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నందు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, ఎంపీపీలు విజయ్, రాజారెడ్డి, ప్రతాప్ గౌడ్ జడ్పిటిసిలు ప్రభాకర్ రెడ్డి, రాజా శేఖర్, మాజీ చైర్మన్ లు గడ్డం కృష్ణా రెడ్డి, శ్రీధర్ గౌడ్, జంబు రామాన్ గౌడ్, మాజీ ఎంపీపీ సత్యా రెడ్డి, మాజీ చైర్మన్ విక్రమ్ సింహ రెడ్డి, తిమ్మారెడ్డి ఎంపీటీసీలు, కౌన్సిలర్స్, పార్టీ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ఎమ్మెల్సీ దంపతులకు ఎమ్మెల్యే దంపతులు ఘనంగా సన్మానం చేశారు.







ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దంపతులను సన్మానం చేస్తున్నా ప్రజా ప్రతినిధులు

# పారదర్శకంగా స్త్రీనిధి రుణాల మంజూరు..

**మహిళా సంఘాలకు ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ తప్పనిసరి.. స్త్రీనిధి మేనేజర్ పలుస విక్రమ్‌కుమార్**

**బిజినపల్లి, జూన్ 03 ప్రభాతవార్త :** మహిళా సమాఖ్యలు, ప్రభుత్వ భాగస్వామ్య సంస్థ స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు అంజేస్తున్న అత్యవసర, జీవనోపాధి రుణాలు పారదర్శకంగా అందించేందుకు పూర్తి చర్యలు చేపడుతున్నట్లు స్త్రీనిధి మేనేజర్ పలుస విక్రమ్‌కుమార్ తెలిపారు. సోమవారం బిజినపల్లి, గంగారం గ్రామ ఐక్యసంఘంలో హెచ్‌ఆర్ ఏపిఎం అమ్మ అనిల్‌కుమార్‌తో కలిసి సంఘం సభ్యుల ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ 2024,25 ఆర్థిక సంవత్సరానికి గాను మహిళా సంఘ సభ్యులకు బిజినేపల్లి మండల పరిధిలో 5 కోట్ల 67 లక్షలు రుణంగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఆధార్ ఆధారిత ధృవీకరణ ద్వారా ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ పూర్తి చేసి, అర్హులైన సభ్యులకు రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సభ్యులు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుని జీవనోపాధులను వృద్ధి చేసుకోవాలని, సమిష్టి బాధ్యతతో క్రమం తప్పని చెల్లింపులు జరుపుతూ వడ్డీలేని రుణాలకు అర్హత కలిగి ఉండాలని సూచించారు. అన్ని గ్రామ సంఘాల పరిధిలో ఈ డాక్యుమెంటేషన్ ప్రక్రియ వేగవంతం చేసి సభ్యులకు సకాలంలో రుణాలు మంజూరు జరిగేలా క్షేత్రస్థాయి సిబ్బందితో కలిసి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిసి ప్రశాంత్, విఓఏ ప్రమీలమ్మ, మహిళా సంఘం లీడర్లు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మహిళా సంఘాలకు ఎలక్ట్రానిక్ డాక్యుమెంటేషన్ పరిశీలిస్తున్న అధికారులు

# ఫలించిన బీడీ కార్మికుల చర్చలు కార్మిక సంఘాల హర్షం

**ఆత్మకూరు జూన్ 3 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గత రెండు నెలలుగా బీడీ కార్మికులకు వేతనాలు పెంచాలంటూ అటు బీడీ యజమానులు ఇటు బీడీ కార్మిక సంఘాల నాయకుల మద్య కొనసాగుతున్న చర్చలు ఎట్టకేలకు సోమవారం రోజు ఫలించాయి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్లో జరిగిన బీడీ కార్మికుల చర్చల్లో భాగంగా బీడీలకు 235 రూపాయల చొపున చెల్లించేందుకు యాజమానులు అంగీకరించడంతో ఇటు కార్మిక సంఘాలు సైతం హర్షం వ్యక్తం చేస్తూ చర్చలకు అంగీకారం తెలిసినట్లుగా కార్మిక సంఘం నాయకులు అరుణ్ కుమార్ మహమూద్ దేవదానం దాసు అబ్రహం తదితరులు వెల్లడించారు బదులుగా యాజమానులు అందులోని ఐదు రూపాయలు తొలగించి కార్మికుల భవిష్యత్తు నిధి ప్రవేటు కోసం జమ చేసేందుకు సూచించడంతో కార్మిక సంఘాల సైతం అంగీకరించిన నేపథ్యంలో ఈ బీడీలకు 230 రూపాయలు అదనంగా ప్రావిడెంట్ ఫండ్ ఐదు రూపాయలు కలిపి మొత్తం 235 రూపాయలు చెల్లించేందుకు కార్మిక యాజమానులు అంగీకరించినట్లుగా కార్మిక సంఘ నేతలు తెలిపారు గత రెండు నెలలుగా కొనసాగుతున్న చర్చలు ప్రతిసారి విఫలం కావడం కార్మిక సంఘాల నాయకులు ఇటు బీడీ కార్మికుల సైతం నిరాశ నిష్పరులకు లోనవుతున్న తరుణంలో ఎట్టకేలకు సోమవారం రోజు చర్చలు ఫలించడంతో కార్మిక సంఘాల నాయకులు హర్షం ప్రకటించారు. బీడీ యాజమాన్ల తరపున సోహెల్ సెట్ విష్ణువర్దన్ రెడ్డి జియాసెట్ తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ ప్రైవేటు హెటల్లో యాజమానులకు కార్మిక సంఘాల నేతలకు మద్య కొనసాగుతున్న చర్చలు



వేతనాల పెంపానంతరం హర్షం ప్రకటిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాలు నాయకులు

## ప్రతిభ చాటిన పాలెం పేద విద్యార్థిని

**బిజినపల్లి, జూన్ 03 ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాలెం విద్యార్థికి పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో ప్రతిభ చాటిందని ఎంఈఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. గుడ్లనర్వ గ్రామానికి చెందిన పేద విద్యార్థిని విజయలక్ష్మి అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్రస్థాయి ర్యాంక్ 938 సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్రస్థాయి ర్యాంకు 1267 సాధించింది. విజయలక్ష్మి ఇటీవలే విడుదలైన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 9.7 జిపిఎ సాధించింది. పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌లో తన ప్రతిభ చాటింది. ప్రతిభ చాటిన విద్యార్థిని ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, మండల విద్యాధికారి భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చంద్రమోహన్‌రెడ్డి, గాయత్రి, రాజు, పూర్ణ చంద్రకళ అభినందించారు. 2022 పాలిసెట్ ఫలితాల్లో కూడా పాలెం విద్యార్థి పి. అనిల్‌కుమార్ రాష్ట్రస్థాయి 112 ర్యాంకు సాధించాడని ఎంఈఓ గుర్తు చేశారు.

## దేవరకద్ర దేవస్థానంలో అన్నప్రసాద వితవిరణ



**దేవరకద్ర, జూన్ 03 ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ ఈశ్వరవీరప్పయ్య దేవస్థానంలో సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సోమవారం భక్తులకు దేవస్థానంలో అన్నప్రసాద వితవిరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే లక్ష్మీపల్లికి చెందిన బద్రిగారి వీరన్న, పరమేశ్వరమ్మ అధ్వర్ యంలో ఈ అన్నప్రసాద వితవిరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.2525 ధర పలికిన సోన

**దేవరకద్ర, జూన్ 03 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు సోమవారం రైతులు 34 కింటాళ్ళ సోన(ఆర్ఎన్ఆర్) ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.2525 ధర పలికింది. అతి తక్కువగా రూ.2479 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## వర్షపు నీటిని బయటకు పంపించడానికి కాలువను పరిశీలిస్తున్న అధికారులు



**గద్వాల ప్రతినిధి జూన్ 3 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల చంద్రశేఖర్ రెడ్డి ధరూర్ మండల కేంద్రంలో నిన్న రాత్రి కురిసిన భారీ వర్షానికి రహదారిపై నీటి నిల్వతో, ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. ఆ వర్షపు నీటిని బయటికి పంపించాలని ధరూర్ మండల అధికారులను సూచించారు. వీరి వెంట ధరూర్ మండల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జాకీర్, వెంకటేశ్, ధరూర్ మండల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



వర్షపు నీటిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు మాజీ చైర్మన్

# జోగులాంబ సన్నిధిలో ప్రముఖులు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

లతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే ని శేష వస్త్రాలతో సన్మానించారు. అనంతరం అర్చకులు తీర్ధ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. నూతన ఎమ్మెల్సీ గా గెలుపొందిన నవీన్ కుమార్ రెడ్డి దంలతులకు ఎమ్మెల్యే విజేయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి అమ్మవారి చిత్ర పటాన్ని బహుకరించారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామి రెడ్డి , ఎమ్మెల్సే విజేయుడు ని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



స్థానిక నాయకులతో ఎమ్మెల్సీ ఎమ్మెల్యే



స్థానిక నాయకులతో ఎమ్మెల్సీ ఎమ్మెల్యే

# ఎస్.పి దేవాదాసు ఘనంగా సత్కరించిన చైర్మన్ బీఎస్ కేవవ్..

**గద్వాల ప్రతినిధి జూన్ 3 ప్రభాతవార్త :** గద్వాల పట్టణానికి చెందిన ఎస్.పి దేవరాజు తెలంగాణ రాష్ట్ర బేడ బుడగ జంగల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపధ్యక్షుడిగా రాష్ట్ర కమీటీ ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ బి.యస్ కేశవ్ కౌన్సిలర్స్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.పి దేవరాజు మిఠాయి తినిపించి శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ కీ.శే.పి దేవరాజు పుష్పగుచ్చం ఇచ్చి శాలువతో ఘనంగా సత్కరించడం జరిగింది ఈ సందర్భంగా భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.కోటేష్ కొండపల్లి ఈశ్వర్ ఎల్లప్ప జనార్దన్ రెడ్డి జయకృష్ణ తులసి , తదితరులు పాల్గొన్నారు.



దేవరాజును సన్మానం చేస్తున్న చైర్మన్ కేశవ్

# డిప్యుటేషన్‌పై ఇటిక్యాల డాక్టర్‌గా రాజశేఖర్

**ఇటిక్యాల,జూన్ 03 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై వచ్చిన డా. రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. ఇటిక్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్న డా. విష్ణు సెలవులో ఉండడంతో ప్రజలకు వైద్య సౌకర్యం అందించేందుకుగాను గట్టు మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్న డా.రాజశేఖర్‌ను ఇటిక్యాల ప్రభుత్వ ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై డాక్టర్ రాజశేఖర్ చేరుకుని బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఓ, ఎంఎల్‌హెచ్‌పి డా. చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిప్యుటేషన్‌పై ఇటిక్యాల డాక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డా. రాజశేఖర్

# యువత స్వశక్తితో ఎదగాలి..

## ఎమ్మెల్యే మాతృమూర్తి జనుంపల్లి శశికళారెడ్డి

**రాజాపూర్,జూన్ 03 ప్రభాతవార్త :** యువత స్వశక్తితో కష్టపడాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి మాతృమూర్తి రంగారెడ్డిగూడ గ్రామ మాజీ సర్పంచ్ జనుంపల్లి శశికళారెడ్డి అన్నారు. సోమవారం రాజాపూర్ మండల కేంద్రంలో రజక సంఘం రాజాపూర్ మండల అధ్యక్షులు దండు శంకర్ ఏర్పాటు చేసిన శంకర్ డ్రై క్లీనింగ్ అండ్ సారీ రోలింగ్ సెంటర్, లాండ్రీ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. అవకాశాలను సృష్టించుకుంటూ స్వయం ఉపాధి పొందేలా వ్యాపారాలు ప్రారంభించడం అభినందనీయమని దండు శంకర్‌ను అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి నర్సింలు, నాయకులు, వనపర్తి నరహరి, తిరుమలాపూర్ యాదయ్య, నజీర్‌బేగ్, శ్యాంసుందర్‌రెడ్డి, బుగ్గయ్య, తిరుపతయ్య, బైండ్ల నరసింహ, భీమగళ్ల నరసింహ,వెంకటేష్, అనిల్, డా. శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కాంత్‌రెడ్డి, చాకలి వెంకటయ్య పాల్గొన్నారు.



డ్రైక్లీనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేసిన ప్రిన్సిపాల్

**కల్వకుర్తి, జూన్ 03 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ విద్య, ఆహ్లాదకరమైన వాతావరణం, సుక్షితులైన అధ్యాపకులచే బోధన ఉంటుందన్నారు. విద్యార్థులు గత సంవత్సరం ఫలితాల్లో మంచి ప్రతిభను కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారని గుర్తు చేశారు. ఇంటర్మీడియట్ కోసం కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వేణయ్య, అధ్యాపకులు సదానందంగౌడ్, లైబ్రేరియన్ లక్ష్మికాంత్ సాగర్, రాజేష్, మల్లేష్, శ్రీనివాస్, నయీం, బాలరాజు, జుబేర్, మల్లిఖార్జున తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

# తెలంగాణ దశాబ్ది దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలు

**గద్వాల ప్రతినిధి జూన్ 3 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం దినోత్సవం దశాబ్ది ఉత్సవాలలో వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా జాతీయ జెండా, పార్టీ జెండాను ఎగురవేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు రోగులకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. 60 ఏళ్ల తెలంగాణ ప్రజల చిరకాల వాంఛ 14 ఏళ్లు కోట్లాడి తొలి మలిదశ ఉద్యమంతో నిజం చేసి 10 ఏళ్ల పాలనతో రాష్ట్రన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడుతూ ప్రతిగడపకు సంక్షేమ ఫలాలు అందించామన్నారు. రాష్ట్రం ప్రపంచంలోని రాష్ట్రం నెంబర్ వన్ స్థానంలో నిలవడం జరిగింది. దశాబ్ది ఉత్సవాలు ముగింపు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రజాప్రతినిధులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణలో రైతులకు, రైతు బీమా రైతు బంధు, 24 గంటల కరెంటు సబ్సిడీ, ఫర్టిలైజర్, రైతు వేదిక, వరి కొనుగోలు సెంటర్ ఏర్పాటు చేసి కొత్త వ్యవసాయ విధానాన్ని తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసిఆర్ కి దక్కుతుందన్నారు. ప్రజలకు మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు నెలలు కరెంటు కష్టాలు, తాగునీటి కష్టాలు, మళ్లీ వలసలుగా మహారాష్ట్ర, ముంబై వెళ్లే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే జరగబోయే ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చేస్తారని సూచించారు. అదే విధంగా ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలలో ఎమ్మెల్సీ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని నవీన్ రెడ్డి ని గెలిపించినందుకు బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులందరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, రాజశేఖర్, ఎంపిపిలు ప్రతాప్ గౌడ్, విజయ్, రాజారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సత్యా రెడ్డి, తిమ్మారెడ్డి, విక్రమ్ సింహారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, సుబాన్, సతీష్, రమేష్ నాయుడు, సుదర్శన్ రెడ్డి, నవీన్ మహబూబ్, ఉరుకుంద, బాబర్, మురళి, నజీర్, కోడిగుడ్ల సలాం, సాయిరెడ్డి, ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు , కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





జాతీయ జెండాను ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

# రైతులకు ఎరువులు విత్తనాలు ఉచితంగా సరఫరా చేయాలి..

## అఖిలభారత ప్రగతిశీలా రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్

**ఆత్మకూరు జూన్ 3 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రైతులకు ఎరువులను విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలని అఖిలభారత ప్రగతిశీలా రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ డిమాండ్ చేశారు ఈ మేరకు సోమవారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ పనులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కేవలం జీలగ విత్తనాలు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నం చేస్తుందని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపించారు కమిషన్ అమలు చేసిన వ్యవసాయ విధానాలను అమలు చేయాలని ప్రభుత్వాలు మారిన రైతులకు మాత్రం అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు కార్పొరేటర్ రంగాలకు వ్యవసాయాన్ని అప్పజెప్పేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయాత్నాలను తక్షణమే విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు గడిచిన దశాబ్ద కాలంగా రైతులకు సర్వరోగ నివారిని మాదిరిగా కేవలం రైతుబంధులు మాత్రమే అందజేసి ప్రభుత్వాలు రైతులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు గత రబీ సీజన్ నుండే వరి ధాన్యానికి 500 రూపాయలు బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చి తీరా ఎన్నికల అనంతరం కలయాపన చేయడం సరికదన్నారు ప్రస్తుత ఖరీఫ్ సీజన్లోనైనా రైతులకు 500 రూపాయలు బోనస్ చెల్లించి రైతులకు అండగా నిలవాలని వారు విజ్ఞప్తి చేశారు అనంతరం ఆత్మకూరు తాసిల్దార్ రాజుకు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు కూలి సంఘం మండల అధ్యక్షులు కే రాజన్న జిల్లా కమిటీ సభ్యులు వెంకటన్న వాసారెడ్డి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆత్మకూరు తాసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



ఆత్మకూరు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

# పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

## మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి.. బాధిత కుటుంబానికి రెండు లక్షల చెక్కు అందజేత

**బిజినపల్లి,జూన్ 03 ప్రభాతవార్త :** బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. నంది వడ్డెమాన్ గ్రామానికి చెందిన కుమ్మరి మైబూస్ కుటుంబానికి వారి ఇంటికి వెళ్లి 2 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. పార్టీ కార్యకర్తగా ఉన్న మైబూస్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించిన విషయాన్ని కుటుంబ సభ్యులతో తెలుసుకున్నారు. ప్రస్తుతం మైబూస్ కుటుంబ సభ్యుల పరిస్థితి వారి పిల్లలు చదువుల విషయాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీల మనుగడ పార్టీ కార్యకర్తల మీద ఆధారపడి ఉంటుందని, ఈ విషయం తెలిసిన మాజీ సీఎం కెసిఆర్, పార్టీ కార్యకర్తలకు మిగతా ఏ పార్టీలకు లేని విధంగా భీమా సదుపాయం కల్పించారన్నారు. వారి ప్రీమియంను కూడా పార్టీ చెల్లించే విధంగా ఏర్పాట్లు చేశారన్నారు. పార్టీకోసం పనిచేసే వారికి బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్ట పరచడంలో కార్యకర్తల పాత్ర క్రియాశీలకమైందన్నారు. బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు ప్రమాద భీమా వర్తిస్తుందని వివరించారు. ప్రతి కార్యకర్తకు అండగా పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు పులెందర్‌రెడ్డి, ఎంపిటిసిలు ఉషన్న, తిరుపతిరెడ్డి, టిఆర్ఎస్ నాయకులు నందకిశోర్, డీలర్ రాజేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

# పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నయం మార్క్సిజమే..

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి అబ్బాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 03 ప్రభాతవార్త :** పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నయం మార్క్సిజమే అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి అబ్బాస్ అన్నారు. సోమవారం సిపిఎం జిల్లా కమిటి ఆధ్వర్యంలో నల్లవెల్లి కురుమూర్తి అధ్యక్షత స్టడీ సర్కిల్ నిర్వహించారు. లెనినిజం అనే అంశంపై ఆయన ప్రసంగిస్తూ ప్రపంచంలో రష్యా విప్లవం తర్వాత సామాజిక, ఆర్థిక రంగాల్లో పెనుమార్పులు వచ్చాయని, సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు పెరుగుతూనే ఉన్నాయన్నారు. పెట్టుబడిదారు దేశాల మధ్య కూడా పోటీ పెరిగి మార్కెట్ల కోసం వర్తమాన దేశాలపై మూడో ప్రపంచ దేశాలపైన ఆంక్షలు విధిస్తున్నారని పేర్కన్నారు. ప్రపంచంలో రష్యా విప్లవము 1917లో జయప్రదం అయిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు సోషలిస్టు దేశాలుగా మారాయన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ మట్టి కరిపించి 15 దేశాల్లో సోషలిస్టు దేశాలుగా ప్రకటించుకున్నాయన్నారు. లెనినిజం మార్క్సిజంలో భాగమేనని, మార్క్స సిద్ధాంతాలను లెనిన్ మరింత పరిపుష్టం చేశారని, మార్క్సిజం లేని నిరం రెండు వేరు కాదు ఒకటే అన్నారు. భారతదేశంలో వర్గ పోరాటాలు ఉధృతంగా జరిగాయని రైతుల పోరాటమే దానికి నిదర్శనం అన్నారు. భారతదేశ పాలకులు మూఢత్వాన్ని, వెనుకబాటు తనాన్ని, ఆధిపత్య భావజాలాన్ని ప్రజలపై రుద్ది ప్రజలను సరైన పద్ధతిలో ఆలోచనలు చేయకుండా వారి బుర్రలను కలుషితం చేస్తున్నారని, కమ్యూనిస్టులు ప్రజలను చైతన్యం చేయాలని, వర్గ పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పాలకవర్గాల నినాదాలు, వారి వాగ్దానాలు ప్రజలు అర్థం చేసుకోలేనంత వరకు ప్రజలు దోపిడీకి గురవుతూనే ఉంటారని ఆయన తెలిపారు. మార్క్స ఎంగిల్స్ లెనిన్ మార్క్సిస్టు మూల సూత్రాలను సరైన పంథాలో సమాజానికి అన్వయించాలని భారతదేశంలో నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్టంగా అధ్యయనం చేసి ప్రజలను చైతన్యవంతం చేయాలని భారతదేశ రాజ్యాంగంలోనే సోషలిస్టు తరహా ప్రభుత్వమని ఉందని ఆయన నొక్కి వక్కాణించారు. ఇందులో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ. రాములు, కార్యదర్శి వర్గ సభ్యులు పద్మ చంద్రకాంత్, నల్లవెల్లి కురుమూర్తి, మోహన్, రాజ్‌కుమార్, ప్రశాంత్, భరత్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండి అబ్బాస్

# పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే మర్రి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,జూన్3,ప్రభాతవార్త:**పార్టీ కార్యకర్త కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మరోసారి అండగా నిలిచారు. గుడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు గువ్వల రమేష్ గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడు గువ్వల రమేష్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొంది ఉండటంతో అతనికి పార్టీ ప్రమాద భీమా పథకం క్రింద రూ.2లక్షల చెక్కును మంజూరు చేయించి సోమవారం గువ్వల రమేష్ తల్లిదండ్రులు గువ్వల పర్వతాలు శారదలకు అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీల మనుగడ పార్టీ కార్యకర్తల మీద ఆధారపడి ఉంటుందని,ఈవిషయం గుర్తించిన మాజీ సీఎం కేసీఆర్ పార్టీ కార్యకర్తలకు మిగతా ఏపార్టీలకు లేనివిధంగా భీమా సదుపాయం కల్పించారన్నారు. వారి ప్రీమియంను కూడా పార్టీ చెల్లించే విధంగా ఏర్పాటు చేశారన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



పమాద భీమా చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

# అమెరికాలో తెలంగాణ దశాబ్ది ఉత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జియంఆర్




**దేవరకద్ర,జూన్ 03 ప్రభాతవార్త:** అమెరికాలో ఆదివారం రాత్రి జరిగిన తెలంగాణ దశాబ్దిఉత్సవ వేడుకల్లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.అమెరికా న్యూజెర్సీలో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యూఎస్ఏ చాప్టర్ అధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.ఈ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.ఈ సందర్భంగా అక్కడున్న ఎన్ఆర్ఐలు ఎమ్మెల్యేకు ఘనంగా సన్మానించారు.

# టీఎస్ పాలీసెట్‌లో కెకె రెడ్డి విద్యార్థుల ప్రతిభ

**తెల్కపల్లి,జూన్ 03 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన కెకెరెడ్డి పాఠశాల విద్యార్థులు టిఎస్ పాలిసెట్ 2024 ప్రవేశ పరీక్షలలో అత్యంత ప్రతిభ కనబర్చి 11 సీట్లు పొందినట్లు పాఠశాల కరస్పాండెంట్ కె. లక్ష్మారెడ్డి, అకాడమిక్ అడ్వైజర్ కె. రఘురాంరెడ్డిలు సోమవారం తెలిపారు. సీట్లు పొందిన ఎం. మనోహర్‌రెడ్డి, ఏ. సాయిచరణ్, జి. అశ్వంత్, కె. వర్షిత, కె. నిశ్వంత్, కె. నరసింహారెడ్డి, కె. వరుణ్‌సాయి, సి. సిరి, ఎం. తేజ, ఆర్. అచల, ఆర్. సాహితి విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు ప్రిన్సిపల్ బాలు, ఉపాధ్యాయులు అభినందించారు.

# కురిసిన వర్షం... చల్లబడిన వాతావరణం...

**వెల్దండ, జూన్ 03 ప్రభాతవార్త:** గత మూడు నెలల నుంచి ప్రజలు వేడిమితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు నైరుతి రుతుపవనాలు ఉమ్మడి పాలమూరు జిల్లాలోకి ప్రవేశించడంతో ఆకాశం మేఘావృతమై వాతావరణం చల్లబడటంతో ప్రజలందరు ఎండ వేడిమి నుంచి ఉపశమనం లభించినట్లైంది. ఆదివారం రాత్రి 43.8 మిల్లీ మీటర్ల వర్షం కురియడంతో మండలంలో వాతావరణం పూర్తిగా చల్లబడింది. రైతులు తమ పొలాలను సాగుకు సిద్ధంగా ఉంచడం వర్షాలు కురియడంతో రైతులు తమ పంట పొలాల్లో విత్తనాలు చల్లేందుకు సిద్ధమవుతున్నారు. రైతులు ఎరువుల దుకాణాల వద్ద భారీగా బారులు తీరుతున్నారు.

# నూతన పోస్టల్ సూపర్డెంట్‌గా బాధ్యతలు చేపట్టిన సైదా నాయక్...



**గద్వాల ప్రతినిధి జూన్ 3 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నూతన పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ గా ఎల్ సైద నాయక్ సోమవారం నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోస్టల్ అధికారులు సిబ్బంది ఆయన శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిపిఎంలు,ఏబీపీఎంలు, ఈడీఎంసి ప్యాకర్లు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ నిర్లక్ష్యానికి పసిప్రాణం బలి..

**ఆటోలో నుంచి ఎగిరిపడ్డ చిన్నారి.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వద్ద ఘటన**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 03 ప్రభాతవార్త :** ఆటో నుంచి ఎగిరిపడి నాలుగు సంవత్సరాల చిన్నారి శాన్విక అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే జడ్చర్ల మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి తన తల్లి ఊరైన తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి కొద్ది రోజుల క్రితం తన కుమారుడితో కలిసి వెళ్లింది. సోమవారం తిరుగు ప్రయాణలో జడ్చర్లకు ప్యాసింజర్ ఆటోలో బయలుదేరింది. ఆటోలో జడ్చర్లకు చేరుకోగానే రాఘవేంద్ర వైన్స్ ముందు వీరు ప్రయాణిస్తున్న ఆటో సడన్ బ్రేక్ వేయడంతో ఆటోలో నుంచి శాన్విక ఎగిరి పడింది. దీంతో తలకు బలమైన గాయమై శాన్విక అక్కడికక్కడే మృతి చెందింది. ఆటోలోనే ఉన్న శాన్విక తల్లి లక్ష్మి తన బిడ్డను కాపాడుకునేందుకు ప్రయత్నం చేసిన ఫలితం దక్కలేదు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే చిన్నారి మృతి చెందినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆటో డ్రైవర్లు రోడ్డు నియమ నిబంధనలు పాటించకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటో డ్రైవర్లు ఇష్టానుసారంగా పరిమితికి మించి ప్రయాణీకులను తరలించడం ప్రమాదానికి మరొక కారణంగా చెప్పవచ్చు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల అతివేగంగా వెళ్లడంతో సడన్ బ్రేక్ వేయడం వల్లే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా పోలీసు ఆర్టీఏ అధికారులు స్పందించి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


చిన్నారి శాన్విక (ఫైల్)

## కౌంటింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి..

**కేంద్రాల వద్ద 144 సెక్షన్.. మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 03 ప్రభాతవార్త :** ఎన్నికల కౌంటింగ్ నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించడం ధ్యేయంగా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఇన్సిడెంట్ ఫ్రీగా లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జరగాలని అందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చాలా ముఖ్యమని ఎస్పీ అన్నారు. పార్లమెంట్ ఎన్నికలు కౌంటింగ్ నిమిత్తం రాజబహదూర్‌రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ జరిగే ప్రదేశం పాలమూరు యూనివర్సిటీలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ జరగాలని సిబ్బందికి తెలియజేశారు. ఇందుకు ప్రజలు నాయకులందరు పోలీసులకు సహకరించాలని కోరారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగేలా పూర్తి భద్రతను ఏర్పాటు చేశామని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన ర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు ఉంటుందని చెప్పారు. కౌంటింగ్ కొరకు 485 మంది సిబ్బందిని నియమించామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్‌కుమార్, మహబూబ్‌నగర్ టౌన్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, డిసిఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, నారాయణపేట డీఎస్పీ లింగయ్య, డిటిసి డీఎస్పీ నర్సింలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్

## నిరంజన్‌రెడ్డి.. నోరు అదుపులో పెట్టుకో..

(మొదటి పేజీ తరువాయి)

ఆ రోజు స్వతంత్రం ఇచ్చిన బ్రిటన్ రాణిని తెలంగాణ రాణిని తెలంగాణ ఆవిర్భాం దినోత్సవానికి పిలవచ్చుగా అన్న మాటలు తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని అవహేళన చేసి మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఆ రోజు తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని మీ నాయకుడు కాళ్ళు మొక్కిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తెలంగాణ మొత్తం జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జరుపుకొనే మీరు మాత్రం జూన్3 జరపడం తెలంగాణలో సిగ్గుచేటన్నారు. గతంలో కసిరెడ్డి నారాయణ ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు బిఆర్ఎస్ పార్టీకి వచ్చిన ఓట్లు ఎన్ని ఇప్పుడు వచ్చిన ఓట్లు ఎన్ని అడుగుతున్న దానిని మీరు లెక్కలును సరిచూసుకుని మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. తమకు గతంలో వచ్చిన ఓట్ల కన్నా 500పైగా ఓట్లు ఎక్కువగా వచ్చాయన్నారు. ఎలక్షన్ కోడ్ అమలవుతున్నందున పథకాలు ఆగిపోయినాయి అన్నమాట వాస్తవం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు 23శాతం ఫిట్మెంట్ ఇవ్వడంతో దాదాపు 5వేల కుటుంబాలకు లాభం చేకూరింది అన్న మాట వాస్తవం కాదా..కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని గ్యారెంటీలను అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. తెలంగాణకు వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా అసెంబ్లీలో మాట్లాడుతూ సోనియాగాంధీ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు అని అసెంబ్లీలో మీరు మాట్లాడింది వాస్తవం కాదా అని ధ్వజమెత్తారు మీ నాయకునికి తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం ఆహ్వానం పంపితే దానిని విస్మరించి రాకపోవడం చాలా విడ్డురంగా ఉందన్నారు. భారతదేశంలో నాలుగు సంవత్సరాలు నివాసం ఉండి లేదా భారత పౌరుని వివాహం చేసుకున్నట్లయితే భారత పౌరసత్వం వస్తుంది మరి అలాంటిది పోయినంత కాలం ఇటలీ అని మాట్లాడడం ఎంతవరకు సమంజసమన్నారు. మోడి జీరో ఖాతాలు తెరవండి రూ.15 లక్షలు మీ అకౌంట్లో జమ చేస్తాం అన్నారు మరి ఎంతమందికి వచ్చాయన్నది ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అద్యక్షుడు కదిరే రాములు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.కృష్ణ, ఫిషరీస్ చైర్మన్, నందిమల్ల యాదయ్య, మండల అధ్యక్షుడు, వెంకటనారాయణ, మైనారిటీ నాయకుడు,హనీఫ్ , సేవాదళ్ అద్యక్షుడు, జానకి రాముడు కాంగ్రెస్ నాయకులు రామరాజు, రమేష్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను కలిసిన మండల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు

**ఇటిక్యాల,జూన్ 03 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్‌రెడ్డి విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడును ఆయన నివాసంలో సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా మండల బిఆర్ఎస్ పారీన ముఖ్య నాయకులు శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఎంపిటిసిలు కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గంలో తన పట్టు నిలుపుకున్న ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు మల్లేష్, కేశన్న, వావిలాల ఎంపిటిసి భర్త చంద్రగౌడ్, బిఆర్ఎస్ కార్యకర్తలు శివకేశవరెడ్డి, గోకారి శేఖరయ్య, రవి, శేషు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



## బీడీ కూలీ పెంపుపై చర్చలు సఫలం..

**చిన్నచింతకుంట,జూన్ 03 ప్రభాతవార్త :** బీడీ కూలి పెంపుపై చర్చలు సఫలమయ్యాయి. తాజాగా సోమవాం బీడీ కూలీ పెంపుపై జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ హోటల్లో బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో కార్మిక సంఘాల నాయకులు చర్చలు నిర్వహించడం జరిగింది. ఇప్పటివరకు ఐదుసార్లు యజమానులతో కార్మిక సంఘాల ప్రతినిధులకు చర్చలు జరిగిన విఫలమయ్యాయి. ఈ 5వ దఫా చర్చలో వేయి బీడీలకు రూ.230 కూలీ, ప్రావిడెంట్ ఫండ్ యాజమాన్యం వాటా రూ. 5 మొత్తం కలిపి వేయి బీడీలకు రూ. 235 పెంచేందుకు బీడీ యజమానులు అంగీకరించారని కార్మిక సంఘాల నేతలు తెలిపారు గ్రాట్యిటీ సమస్య పెండింగ్‌లో ఉంచారు. గ్రాట్యిటీ కూడా చర్చించాలని కార్మిక సంఘాలు పట్టుబట్టడంతో బీడీ యజమానులు గ్రాట్యిటీ గురించి చర్చించడం కొరకు మారో మారు చర్చిద్దామని వాయిదా వేశారు. గత రెండు సంవత్సరాలుగా అనేక మంది కార్మికులు పనిచేస్తూ చనిపోయారని, చాలా మంది కార్మికులు చేతకాక పనిని మానుకున్నారని వాళ్లకు ఇప్పటిదాకా గ్రాట్యూటీ చెల్లించకపోవడం విచారకరమని కార్మిక సంఘాలు వాపోయాయి. గ్రాట్యుటీ పెంచే విషయంలో గతం మాదిరిగా యజమానులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కార్మిక సంఘాలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. పెంచిన కొత్త కూలీ ఏప్రిల్ 1 నుండి అమలు అవుతుంది. ఈ చర్చలో బీడీ ఫ్యాక్టరీ యజమానులు సోహెల్, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వసీం, జియాసెట్, కార్మిక సంఘాల నాయకులు, ఏఐటియుసి నాయకులు మాకం రామ్మోహన్, పి. వెంకటేష్, రాబర్ట్, టిఎఫ్‌టియు నాయకులు ఎస్ఎం ఖలీల్, పి. యాదగిరి, శ్రీనివాస్‌గౌడ్, టిఆర్ఎస్ కార్మిక విభాగం నుండి అబ్రహాం, ఎస్. జాన్, పెద్ద బాలరాజు, ఐఎఫ్‌టియు నుండి కె. సూర్యం, జెఎన్ దేవదానం, పి. అరుణ్‌కుమార్ సిఐటియు నుండి ఎండి మహిమూద్, వేణుగోపాల్, బుచ్చన్న, ఐఎన్‌టియుసి దాసు, పెద్ద బాలరాజు, సవరన్న పాల్గొన్నారు.



# తెలంగాణ స్ఫూర్తి ప్రధాత కేసిఆర్..

**- సంక్షేమ పథకాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది...**

**- తెలంగాణ అవతరణ దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 3, ప్రభాతవార్త:** 14ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరాటంలో తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని మొక్కవొని దీక్షతో సాధించి తెలంగాణ స్ఫూర్తి ప్రధాతగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఉద్యమ పునాదుల మీద ఏర్పడిన తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచి అన్ని వర్గాలకు నూతన రాష్ట్ర ఫలాలను అందించేందుకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశానికి తెలంగాణను ఆదర్శవంతంగా చూపిన ఘనత మాజీ ముఖ్యమంత్రిది అని ఆయన పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ పిలుపు మేరకు తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి ప్రొఫెసర్ జయశంకర్, అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సమైక్యాంధ్ర పాలనలో ఎన్నో అవమానాలు, అణిచివేతకు గురై ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనం కోసం మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి రాష్ట్ర సాధనకు బీజం వేశారని, ఎంతో మంది త్యాగల వల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, తొమ్మిదేండ్ల తెలంగాణ విజయప్రస్థానంలో మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అనేక ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలిపారని వారు కొనియాడారు. ఆయన స్ఫూర్తితో నేడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగించి ప్రజలందరికి సుభిక్ష పాలన అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


ప్రొఫెసర్ జయశంకర్, అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు


తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

# కౌంటింగ్‌కు పకడ్బంది ఏర్పాట్లు..

**సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలి**

**కౌంటింగ్ ఏర్పాట్లు పరిశీలించిన రిటర్నింగ్ అధికారి రవినాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జూన్ 03 ప్రభాతవార్త :** నేడు (జూన్4)న పాలమూరు యూనివర్సిటీలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని రిటర్నింగ్ అధికారి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రవినాయక్ వెల్లడించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పాలమూరు యూనివర్సిటీలో కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ పరిశీలించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలు అంశాలపై సూచనలు, సలహాలు అందజేశారు. సిసి కెమెరాలు, బారికేడ్స్, పలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రశాంతంగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్ హాల్లోకి గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఇతరులను ఎవరిని అనుమతించవద్దని పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఓట్లను లెక్కించాలని సూచించారు. స్ట్రాంగ్ రూముల్లో నుంచి కౌంటింగ్ హాల్లోకి ఈవిఎంలను జాగ్రత్తగా తరలించాలని పేర్కొన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కౌంటింగ్ సాఫీగా సాగేలా సిబ్బంది ప్రత్యేక కృషి చేయాలని తెలిపారు. అనంతరం మీడియా సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పాల్గొన్నారు.


కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్




కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి కలెక్టర్ రవినాయక్

# ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి..

**జోగులాంబ గద్వాల జిల్లా ఎన్నికల అధికారి బి.యం. సంతోష్**

**గద్వాల ప్రతినిధి జూన్ 3 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గంలోని 2 అసెంబ్లీ సెగ్మెంట్లు గద్వాల, అలంపూర్ పరిధిలో పోలైన ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి బి. యం. సంతోష్ తెలిపారు. నాగర్ కర్నూల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ గోదాములో ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ఉదయం 8 :00 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా కౌంటింగ్ సిబ్బందికి అన్ని విధాలుగా సన్నద్ధం చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ఇప్పటికే పలు విడతలుగా శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించామని అన్నారు. ఎలాంటి పొరపాట్లు, గందరగోళానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కోసం కూడా ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. పోలైన ఓట్ల లెక్కింపు కోసం గద్వాల సెగ్మెంట్‌కు 16, అలంపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు 14 చొప్పున టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందని, మధ్యాహ్నం 3 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఎలాంటి గందరగోళానికి తావులేకుండా పక్కాగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్, ఆర్డీఓ రాంచందర్, గద్వాల్, అలంపూర్ తాసిల్దార్లు ఎన్నికల విభాగం తాహసిల్దార్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.


ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి

**మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో**

# తెలంగాణ ఆవిర్భావ ముగింపు వేడుకలు..

**ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం.. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ**

**మక్తల్,జూన్ 03 ప్రభాతవార్త :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ముగింపు ఉత్సవాల సందర్భంగా నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పట్టణంలోని స్థానిక పడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలుగుతల్లి, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నరసింహగౌడ్, పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు, వార్డు కౌన్సిలర్లు జగ్గలి రాములు, మొగులప్ప, పార్టీ ముఖ్య నాయకులు జుట్ల శంకర్, శివారెడ్డి, నరసింహారెడ్డి, జె. సాగర్, మక్తల్ బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ ఈశ్వర్‌యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

# పర్యావరణ అనుకూల ఉత్పత్తులపై మహిళా రైతులకు శిక్షణ

**రాజాపూర్,జూన్ 03 ప్రభాతవార్త :** పర్యావరణ అనుకూల ఉత్పత్తులపై సామాజిక విజ్ఞాన కళాశాల కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మహిళా రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్రహారం పొట్లపల్లి గ్రామంలో మహిళా రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నోడల్ ఆఫీసర్ డా.సీమ, డా. విజయలక్ష్మి, షెడ్యూల్ కులాల వారికి పర్యావరణపై సమాజంలో పర్యావరణను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని పర్యావరణను కాపాడే విధంగా పర్యారణానికి అనుకూలమైన ఉత్పత్తులపై ప్రత్యేక శిక్షణలో భాగంగా వెదురుతో తయారు చేసి అనుకూల ఉత్పత్తులపై ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఇందులో దాదాపు 60 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. ఇలాంటి శిక్షణ కార్యక్రమాలలో పిజెటిఎస్ఏ విశ్వవిద్యాలయం ముందంజలో ఉందంటూ డాక్టర్ నీలారాణి పేర్కొన్నారు. హెడ్ ఆఫ్ డిపార్టుమెంట్ మహిళలకు తాము సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు ఆదాయ ఉత్పాదక కార్యక్రమాలలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. కార్యక్రమంలో డా. శ్వేత హేమలత, డా.విల్కు,పాల్, వనరుల నిర్వహణ, వినియోగదారుల శాస్త్ర విభాగము విద్యార్థులు పాల్గొన్నారు.


శిక్షణలో పాల్గొన్న మహిళా రైతులు

## పాలిసెట్‌లో స్టేట్ ర్యాంక్ సాధించిన శిశు మందిర్ విద్యార్థి

**కల్వకుర్తి, జూన్ 03 ప్రభాతవార్త:**కల్వకుర్తి పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి సన్‌దిష్ సోమవారం వెలువడిన పాలిసెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో 82, అగ్రికల్చర్ విభాగంలో రాష్ట్ర 36వ ర్యాంక్ సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమోహన్ తెలిపారు. స్టేట్ ర్యాంక్ సాధించిన సన్‌దిష్‌ను పాఠశాల యాజమాన్య కమిటీ, ఉపాధ్యాయ బృందం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు.



## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే...



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూన్ 03 ప్రభాతవార్త:**తాడూర్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల మహేందర్ భార్య పద్మ సూది మందు వికటించి ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సోమవారం మృతురాలి ఇంటికి చేరుకొని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి భర్త ఎర్రోళ్ల మహేందర్‌ను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. పార్టీ పర ంగా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రియాంక ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకునేలా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## పట్టణంలో సైక్లింగ్ ర్యాలీ



**మక్తల్,జూన్ 03 ప్రభాతవార్త :** ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మక్తల్ స్టేడియంలో 30 మంది బాల బాలికలు మక్తల్ పురవీధుల గుండా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శాంత, పిఇటీ గోపాలం మాట్లాడుతూ సైకిల్ ర్యాలీని పెద్ద ఎత్తున నిర్వహించాలని ఉన్నా వర్షం కారణంగా వాయిదా వేస్తున్నామని, తదుపరి తేదీని త్వరలోనే వెల్లడిస్తానని పీఈటి గోపాలం అన్నారు. కార్యక్రమంలో బి.రూప, సి. అబ్రేష్, ఎస్. రమేష్‌లు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి..

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



**చిన్నంబావి,జూన్ 03 ప్రభాతవార్త :** భూమిలేని నిరుపేద కౌలు రైతులకు కౌలు రైతు గుర్తింపు సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వం నుంచి పట్టా రైతులకు అందే రాయితీలు అన్నింటిని కౌలు రైతులకు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా రెవెన్యూ పరిపాలన అధికారిణి కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భూస్వాములు, ధనిక రైతుల దగ్గర పట్టా భూములను భూమిలేని పేదలు కౌలు రైతులు ఎకరాకు 15 వేల నుంచి 40 వేల వరకు కౌలు చెల్లించి భూములు సాగు చేస్తున్నారని, ప్రకృతి వైపరిత్యాల వలన పంట నష్టాలు జరిగినా, ప్రభుత్వాల నుండి వచ్చే ప్రతి నష్టపరిహారాన్ని కౌలు రైతుకే ఇవ్వాలని, కౌలు రైతులకు వ్యవసాయ బ్యాంకుల ద్వారా పంట రుణాలను సైతం కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం 500 బోనస్ ఇస్తానన్న పథకాన్ని కూడా పట్టా రైతుతో సంబంధం లేకుండా కౌలు రైతుకే నేరుగా ఇవ్వాలన్నారు. కౌలు బందు కింద రాష్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని, పట్టాదారు రైతుబంధు మాదిరిగానే ఎకరాకు 15 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి కౌలు రైతులను ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో కౌలు రైతులు ఎం. పరమేశ్వర్, వి. వెంకటేశ్వర్లు, జి. నరసింహ తదితరులు పాల్గొన్నారు.